
# సాక్షి సిద్దిపేట

శుక్రవారం, 12, మే, 2023


**రింగురోడ్డుపై నిర్లక్ష్యం ఎందుకు?**
గజ్వేల్ రింగు రోడ్డుపై నిర్లక్ష్యం అలుముకుంది. 1.5 కిలో మీటర్ల మేర పెండింగ్‌లో పడింది. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 10లో





**అద్దె బస్సు డ్రైవర్ల ఆందోళన**
ఆర్టీసీ అధికారులు తమపై దుర్భాషలాడారని అద్దె బస్సు డ్రైవర్లు ఆందోళన చేపట్టిన సంఘటన ప్రజ్ఞాపూర్‌లోగల జీపీపీ డిపో ఎదుట చోటు చేసుకుంది. 10లో





**ఉత్సవాలకు ఆలయం ముస్తాబు**
కొండపాక మండలం రవీంద్రనగర్‌లో శుక్రవారం నుంచి భక్తాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. 11లో..


# స్వచ్ఛతలో మన పల్లెలు

**ఓడీఎఫ్ ప్లస్ మోడల్‌గా సిద్దిపేట గ్రామాలు**

- రాష్ట్రంలో మొదటి వరుసలో సిద్దిపేట
- మెదక్‌లో 108, సంగారెడ్డిలో 278 గ్రామాలు
- ఫోర్ స్టార్ రేటింగ్ నుంచి ఫైవ్ స్టార్ వైపు అడుగులు
- త్రీస్టార్ రేటింగ్‌లో కొనసాగుతున్న సంగారెడ్డి, మెదక్‌లు

సాక్షి, సిద్దిపేట : స్వచ్ఛతలో మన పల్లెలు జాతీయ స్థాయిలో మెరిశాయి. రాష్ట్రంలోని అన్ని గ్రామాలు వంద శాతం బహిరంగ మలవిసర్జన రహిత (ఓడీఎఫ్ ప్లస్) గ్రామాలుగా మారాయి. స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్–2023 రెండో దశ ఫలితాలను కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించింది. సిద్దిపేట జిల్లాలోని అన్ని పల్లెలు ఓడీఎఫ్ ప్లస్ మోడల్ గ్రామాలుగా నిలిచాయి. సంగారెడ్డిలో 278 గ్రామాలు, మెదక్‌లో 108 గ్రామాలు ఓడీఎఫ్ ప్లస్ మోడల్ గ్రామాలుగా స్వచ్ఛ భారత్ మిషన్– 2023 ప్రకటించారు. స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్‌లో మూడో క్వార్టర్‌లో ఏప్రిల్ నెలలో ఫోర్ స్టార్ నుంచి ఫైవ్ స్టార్ రేటింగ్ వైపు అడుగులు పడ్డాయి.

**ఓడీఎఫ్ ప్లస్ మోడల్ అంటే....**

గ్రామంలోని అన్ని కుటుంబాలకు మరుగు దొడ్డి ఉండాలి, పాఠశాలలు/అంగన్‌వాడీ కేంద్రాలు/పంచాయతీ కార్యాలయంలో మగ, ఆడవారికి ప్రత్యేక మరుగుదొడ్లు ఉండి, నిరంతరం వినియోగించాలి. గ్రామంలోని అన్ని బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం, మురుగు నీరు నిలిచే ప్రదేశాలు తక్కువగా ఉండి, ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా ఉండాలి. గ్రామంలో కుటుంబ స్థాయి, కమ్యూనిటీ స్థాయిలో ఘన వ్యర్థాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి. గ్రామంలో కుటుంబ, కమ్యూనిటీ స్థాయిలో ద్రవ వ్యర్థాల నిర్వహణకు తగిన అన్ని ఏర్పాట్లు ఉండాలి. ఇలా నియమాలు 80 శాతం పాటించిన గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్ మోడల్ కేటగిరీలో ఎంపిక చేశారు. త్వరలో ఆయా గ్రామాలను పరిశీలించి ఓడీఎఫ్ ప్లస్ మోడల్‌గా ధృవీకరించనున్నారు.

**ఫోర్ స్టార్ నుంచి ఫైవ్ స్టార్ వైపు..**

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా ప్రతీ మూడు నెలలకోసారి స్టార్ మార్కుల రేటింగ్స్‌ను స్వచ్ఛ భారత్ మిషన్ వెల్లడిస్తోంది. జనవరి, ఫిబ్రవరి, మార్చి– 2023 సంవత్సరానికి గాను జిల్లా ఫోర్ స్టార్‌గా నిలిచింది.

- ఏప్రిల్, మే, జూన్–2023కి గాను ఏప్రిల్ నెలలో ఫోర్ స్టార్ రేటింగ్ నుంచి ఫైవ్ స్టార్ వైపు అడుగులు పడ్డాయి. బేస్‌లైన్ ఓడీఎఫ్ ప్లస్ స్కోర్ 62.61, ప్రస్తుత ఓడీఎఫ్ ప్లస్ స్కోర్ 100, డెల్టా అచీవ్‌మెంట్ స్కోర్ 300 నమోదు చేసింది. దీంతో ఫోర్ స్టార్ నుంచి ఫైవ్ స్టార్ వైపు సాగుతోంది. పూర్తి స్థాయిలో స్టార్ రేటింగ్‌లను జూలైలో ప్రకటించనున్నారు. తర్వాత స్వచ్ఛ సర్వేక్షణ్–గ్రామీణ్ అవార్డులు సెప్టెంబర్‌లో ప్రకటించనున్నారు.
- త్రీస్టార్‌లో సంగారెడ్డి, మెదక్ జిల్లాలు కొనసాగుతున్నాయి. సంగారెడ్డి జిల్లాకు బేస్‌లైన్ ఓడీఎఫ్ ప్లస్ స్కోర్ 55.05, ప్రస్తుతం ఓడీఎఫ్ ప్లస్ స్కోర్ 63.80, డెల్టా అచీవ్‌మెంట్ స్కోర్ 58.67 సాధించింది.
- మెదక్ జిల్లా బేస్‌లైన్ ఓడీఎఫ్ ప్లస్ స్కోర్ 50.96, ప్రస్తుత ఓడీఎఫ్ స్కోర్ 50.87, డెల్టా అచీవ్‌మెంట్ స్కోర్ ఏమీసాధించలేదు. జూలైలో ప్రకటించే స్టార్ రేటింగ్‌లో పెరిగే అవకాశాలున్నాయి.



మిట్టపల్లిలో తడిపొడి చెత్తను సేకరిస్తున్న పారిశుధ్య సిబ్బంది (ఇన్‌సెట్‌లో) మిట్టపల్లిలో నిర్మించుకున్న మరుగుదొడ్డి

**పల్లె ప్రగతితోనే సాధ్యమైంది..**



సీఎం కేసీఆర్ విజన్‌తో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెప్రగతితోనే ఇది సాధ్యమైంది. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పల్లెప్రగతి కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేయడం ద్వారానే సంపూర్ణ స్వచ్ఛ పంచాయతీలుగా రూపుదిద్దుకున్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ప్రతీ కుటుంబానికి వ్యక్తిగత మరుగుదొడ్లు, పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో , పంచాయతీల్లో మరుగుదొడ్ల సౌకర్యం, ఘన, ద్రవ వ్యర్థాల కోసం ఏర్పాట్లు చేయడం ద్వారా జిల్లా ఫైవ్‌స్టార్ కెటగిరీకి ఎదిగింది. ఇదంతా ప్రజల భాగస్వామ్యం, ప్రజాప్రతినిధులు, అధికారుల పనితీరుతోనే సాధ్యమైంది. వారందరికీ అభినందనలు.. – హరీశ్ రావు, ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి

**అవార్డు గెలుచుకుంటాం..**



స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 అవార్డు గెలుచుకునేందుకు అందిరి కృషితో ముందుకు సాగుతాం. అవార్డు గెలుచుకుంటాం. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను మండలానికి ఒకటి చొప్పన ఏర్పాటు చేస్తున్నాం. ఫికల్ స్లడ్జ్ మేనేజ్ మెంట్ ప్లాంట్ కోసం కృషి చేస్తాం. –దేవకీదేవి, డీపీఓ

**రాష్ట్రంలోనే సిద్దిపేట టాప్**

మరుగుదొడ్లు, ఘన వ్యర్థ నిర్వహణ, చెత్తాచెదారం వేయకుండా, నీళ్లు నిల్వకుండా చర్యలు తీసుకోవడంతో సిద్దిపేట జిల్లాలోని 499 గ్రామ పంచాయతీల్లోని గ్రామాలు ఓడీఎఫ్ ప్లస్ మోడల్ గ్రామాలుగా అర్హత సాధించాయి. దీంతో జిల్లా రాష్ట్రంలోనే టాప్‌గా నిలిచింది.

| జిల్లా | మొత్తం గ్రామాలు | ఓడీఎఫ్ ప్లస్ | ఓడీఎఫ్ ప్లస్ మోడల్ |
|---|---|---|---|
| సిద్దిపేట | 499 | 499 | 499 |
| మెదక్ | 469 | 469 | 108 |
| సంగారెడ్డి | 647 | 647 | 278 |

- సంగారెడ్డి, మెదక్ జిల్లాలు ఓడీఎఫ్ ప్లస్ సాధించనప్పటికీ ఓడీఎఫ్ ప్లస్ మోడల్ గ్రామాలుగా పూర్తిగా స్థాయిలో తీర్చిదిద్దలేదు.

| | సిద్దిపేట | మెదక్ | సంగారెడ్డి |
|---|---|---|---|
| సెగ్రిగేషన్ షెడ్లు | 591 | 518 | 740 |
| కమ్యూనిటీ సోక్ పిట్స్ | 782 | 551 | 877 |
| కమ్యూనిటీ కంపోస్ట్ పిట్స్ | 622 | 536 | 749 |
| ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ | 00 | 00 | 06 |
| ఫిజికల్ స్లడ్జ్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ | 03 | 04 | 04 |
| కమ్యూనిటీ శానిటరీ కాంపెక్స్‌లు | 520 | 300 | 62 |

## న్యూస్‌రీల్

### ఆలయాల అభివృద్ధికి కృషి



దుబ్బాకలో హనుమాన్ యజ్ఞంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారని ఎంపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం దుబ్బాక పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో హనుమత్ యజ్ఞం, స్వాములకు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. హనుమంతుని కృపతో దుబ్బాక ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నారు. స్వాములకు సేవచేసే భాగ్యం కలగడం చాలా ఆనందంగా ఉందన్నారు. మతం పేరుతో రాజకీయాలు చేయడం కాదని.. కేసీఆర్ లాగా సర్వమతాలను సమాన దృష్టితో చూడాలన్నారు. దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున హనుమాన్ స్వాములు, ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ లీడర్లు పాల్గొన్నారు.

**సమష్టి కృషితోనే దేవాలయం అభివృద్ధి**

ప్రశాంత్ నగర్(సిద్దిపేట): సమష్టిగా పనిచేసి దేవాలయాన్ని అభివృద్ధి చేశారని ఎంపీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని నీలకంఠేశ్వర్ ఆలయంలో స్వామివారి కల్యాణ వేడుకలకు ఆయన హాజరయ్యారు. అనంతరం పదోతరగతి, ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంజుల, మాజీ చైర్మన్ రాజనర్సు, ప్రతినిధులు నర్సింలు, రాజు, యోగి తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



విద్యార్థులను అభినందిస్తున్న అడిషనల్ డీసీపీ (అడ్మిన్) మహేందర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చిన్నప్పటి నుంచే విద్యార్థులు బాగాచదివి ఉన్నతంగా ఎదగాలని అడిషనల్ డీసీపీ(అడ్మిన్) మహేందర్ అన్నారు. పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన పట్టణంలోని కాకతీయ ఈటెక్నోస్కూల్ విద్యార్థులను గురువారం ఆయన అభినందించారు. ఇష్టంతో చదివి లక్ష్యాన్ని అధిగమించాలని.. తల్లిదండ్రులు, విద్యనేర్పిన గురువులు, చదువుకున్న పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జగ్గు మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ కవిత, పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాలు బాగున్నాయి



మార్కెట్‌ను పరిశీలిస్తున్న మహారాష్ట్ర రైతులు

గజ్వేల్: తెలంగాణలో సంక్షేమ పథకాలు బాగున్నాయని ఆ రాష్ట్రానికి చెందిన రైతు ప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం మహారాష్ట్రలోని బిడ్ జిల్లాకు రెందిన రైతు నాయకుడు వినోద్ మోటే, పూణేకు చెందిన దీలీప్‌గాట్వార్‌ల ఆధ్వర్యంలో కొండపోచమ్మసాగర్‌ను సందర్శించారు.అనంతరం గజ్వేల్‌లోని ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్‌ను పరిశీలించారు. ఇలాంటి మార్కెట్ తమ రాష్ట్రంలో ఎక్కడా లేదన్నారు. ఒకేచోట పండ్లు, కూరగా యలు, మాంసం, ఇతర నిత్యావసరాలు దొరుకుతున్న తీరు బాగుందన్నారు. ఆట స్థలం, గార్డెనింగ్ కనువిందు చేస్తున్నాయని ప్రశంసించారు. గోదావరి జలాలను 518 మీటర్లకుపైకి ఎత్తిపోసి కొండపోచమ్మసాగర్‌కు తీసుకురావడం అద్భుతమన్నారు. అంతకుముందు మహారాష్ట్ర రైతు ప్రతినిధి బృందాన్ని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి స్వాగతం పలికారు.

### స్టీల్ బ్యాంకుతో మేలు



బ్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

కొండపాక(గజ్వేల్): ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించేందుకు ప్రభుత్వం స్టీల్ బ్యాంకు పద్ధతిని అమల్లోకి తెచ్చిందని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో స్టీల్ బ్యాంకు వాడకాన్ని గురువారం ఎంపీపీ సుగుణ, ఉపాధ్యక్షుడు దేవి రవీందర్, సర్పంచ్ మల్లమారి రవీందర్‌తో కలిసి ప్రారంభించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా స్టీల్ బ్యాంకు వాడకం మంచిపద్ధతన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, ఆత్మ కమిటీ డైరెక్టరు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యం

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో సిద్దిపేట నియోజకవర్గ జెడ్పీటీసీలు, ఎంపీపీలతో సమీక్ష నిర్వహించారు. మత్స్యకార వృత్తిపై ఆధారపడి బతుకుతున్న వారి కుటుంబాల అభివృద్ధి కోసం కొత్తగా సభ్యత్వ నమోదు ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. 18 నుంచి 55 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పురుషులు మత్స్యశాఖ సహకార సంఘంలో చేరొచ్చన్నారు. స్కిల్ టెస్టు ఆధారంగా ప్రొసిడింగ్ పత్రాన్ని అందజేస్తామని తెలిపారు. సమావేశం లో మంత్రి ఓఎస్డీ బాల్ రాజ్, జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం, సీనియర్ నాయకులు రాధాకృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

**గజ్వేల్‌ను ఆదర్శంగా నిలపాలి...**

మనఊరు మనబడి పథకంలో భాగంగా గజ్వేల్ నియోజకవర్గంలో జరుగుతున్న పనులు ఆదర్శంగా ఉండేలా చేయాలని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లు, ఎంఈవో, ఎంపీడీఓ, ఎంపీఓ, ఇంజినీరింగ్ విభాగం ఈఈ, డీఈ, ఏఈ నిర్మాణ ఏజెన్సీలు, సర్పంచ్‌లతో సమీక్ష నిర్వహించారు. సీఎం కేసీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న గజ్వేల్‌లో మన ఊరు మనబడి పనులు పకడ్బందీగా చేయాలన్నారు. వర్గల్, కొండపాక మండలాల్లో జరుగుతున్న పనులను డీఈఓ పర్యవేక్షించాలన్నారు. ఈజీఎస్ పనుల్లో వేగం పెంచాలని డీఆర్‌డీఏ పీడీ చంద్రమోహన్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ చంద్రమోహన్ రెడ్డి, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఈడబ్ల్యూఐసీడీ ఈఈ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేక విధానాలు ఎండగట్టాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

హుస్నాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఐ జాతీయర కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి కోరారు. గురువారం ఆయన ఈనెల 15న హుస్నాబాద్‌లో నిర్వహించే సభను విజయవంతం చేయాలంటూ ఇంటింటా ప్రచారం చేశారు. బీజేపీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేదల నడ్డివిరిచిందని చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. జీఎస్టీ పెంచి పెను భారం మోపిందన్నారు. బీజేపీ అధికారం చేపట్టినప్పటినుంచి మత ఘర్షణలు, కులాల మధ్య కొట్లాటలు జరుగుతున్నాయని ఆరోపించారు. విజయ్ మాల్యా, అదానీ, అంబానీలకు తొత్తుగా మారి కొట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. రాష్ట్రంలో రుణమాఫీ కాలేదని, రైతు బీమా అందలేదన్నారు. అనంతరం ఆయన పట్టణంలో సీపీఐ సీనియర్ నాయకుడు దివంగత గూళ్ల ఆశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, లీడర్లు అయిలేని సంజీవరెడ్డి, కొయ్యడ కొమురయ్య, గూడ పద్మ, రాజ్‌కుమార్, స్వప్న, అరుణ, బాలవ్వ, సునీత తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటా ప్రచారం చేస్తున్న చాడ వెంకట్ రెడ్డి

## అంకితభావంతో పనిచేయాలి

పోలీస్ కమిషనర్ శ్వేత

సిద్దిపేటజోన్: పోలీసులు అంకితభావంతో విధులు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ శ్వేత కోరారు. గురువారం పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధినిర్వహణలో ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందికి కేపీ రివార్డ్స్ అందజేశారు. ప్రతీనెల పనితీరు పరిశీలించి అవార్డులు, రివార్డులు ఇస్తామని సీపీ అన్నారు. కష్టపడి పనిచేసేవారికి పోలీస్ శఖాఖలో గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం 42 మందికి రివార్డ్స్ పంపిణీ చేశారు.

**విచారణ పారదర్శకంగా ఉండాలి...**

ఏ కేసులోనైనా విచారణ పారదర్శకంగా చేపట్టాలని సీపీ శ్వేత సూచించారు. కమిషనరేట్‌లో పెండింగ్ కేసులపై నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో 60 రోజుల్లో విచారణ పూర్తిచేసి చార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. 2021–22 సంవత్సరానికి సంబంధించిన పెండింగ్ కేసులు త్వరగా ట్రేస్‌అవుట్ చేయాలన్నారు. సైబర్ నేరాలు, మహిళల రక్షణ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అధికారులు, సిబ్బంది టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. సిద్దిపేట పోలీసులు రాష్ట్రస్థాయిలో భేష్ అనిపించుకునేలా పనిచేద్దామన్నారు. సీసీ కెమెరాలను ప్రతీరోజు మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. అనంతరం సీపీఆర్ శిక్షణ పొందిన 131 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 93 మందికి సర్టిఫికెట్లు అందజేశారు.



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న సీపీ శ్వేత

సమావేశంలో అడిషినల్ డీసీపీ(అడ్మిన్) మహేందర్, ఏసీపీలు దేవారెడ్డి, చంద్రశేఖర్, ఫణి, రవీందర్ రాజు, ఇన్‌స్పెక్టర్లు భిక్షపతి, రఘుపతి రెడ్డి, భానుప్రకాశ్, గురుస్వామి, రామకృష్ణ, దుర్గ, జానకిరామ్ రెడ్డి, కృష్ణ, శ్రీధర్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**సైబర్ నేరాలపట్ల అప్రమత్తం..**

సిద్దిపేట కమాన్: సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సీపీ శ్వేత కోరారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ. 41.38 లక్షలు సైబర్ నేరాగాళ్లకు చేరకుండా ఫ్రీజ్ చేసినట్లు ఆమె తెలిపారు. డబ్బులు బాధితుల ఖాతాలో జమచేస్తామన్నారు. సోషల్ మీడియాలో వచ్చే లింక్ లను ఓపెన్ చేయొద్దని, బ్యాంకు ఖాతాల వివరాలు ఎవరికీ చెప్పొదన్నారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930కి కాల్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

## కీమో సేవలు షురూ

- కేన్సర్ బాధితులకు ఊరట
- సిద్దిపేట జనరల్ ఆసుపత్రిలో స్పెషల్ యూనిట్

సిద్దిపేటజోన్: కేన్సర్ బాధితులు వ్యయప్రయాసాల కోర్చి దూర ప్రాంతాలకు వెళ్లే బాధ తప్పింది. ఇటీవల సిద్దిపేట గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు కీమోథెరపీ సేవలు ప్రారంభించిన విషయం తెలిసిందే. గురువారం జిల్లాలోని పెద్దసముద్రాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని ఎం.ఎన్.జే ఆసుపత్రి నుంచి కీమో సేవలనిమిత్తం సిద్దిపేటకు రిఫర్ చేశారు. దీంతో జిల్లా వైద్యాధికారి డాక్టర్ కాశీనాథ్, మెడికల్ కాలేజీ డైరెక్టర్ విమలథామస్, ఆర్ఎంఓ చంద్రశేఖర్, హేమలత, అంకాలజీ విభాగం డాక్టర్లు అఖిల్, ఆసిఫ్, శ్రీనివాస్ పర్యవేక్షణలో తొలి కీమోథెరపీ సేవలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి కాశీనాథ్ మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు చొరవతో స్థానిక ఆస్పత్రిలో కీమోథెరపీ అందుబాటులోకి వచ్చిందన్నారు. కేన్సర్ బాధితులు ప్రభుత్వ ఆసుపత్రిలోని రూం నెంబర్ 88లో సంప్రదించి సేవలు పొందవచ్చన్నారు. నిమ్స్, ఎం.ఎన్.జే ఆసుపత్రుల సూచన, సిఫార్స్ మేరకు ఉచితంగా సేవలు అందిస్తామన్నారు. వైద్యశాఖ రికార్డుల ప్రకారం సిద్దిపేట జిల్లాలో 96 మంది బాధితులు వివిధ ప్రాంతాల్లో చికిత్సపొందుతున్నారని, వారందరికీ దశలవారీగా స్థానికంగానే సేవలు అందిస్తామని వివరించారు.

## గుడాటిపల్లి నేలమట్టం



గుడాటిపల్లిలో నేలమట్టమైన ఇళ్లు

- శ్మశానాన్ని తలపించిన ఊరు
- అనుబంధాన్ని గుర్తుచేసుకున్న గ్రామస్తులు
- కంటతడిపెట్టిన నిర్వాసితులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం ముంపు గ్రామమైన గుడాటిపల్లి గ్రామం పూర్తిగా నేలమట్టం అయ్యింది. బుధవారం అర్ధరాత్రి వరకు పోలీసుల భారీ బందోబస్తు మధ్య నిర్వాసితులను ఊరు నుంచి ఖాళీ చేయించారు. ఎక్కడికక్కడ ఇళ్లను కూల్చివేశారు. దీంతో ముంపు గ్రామంతా ఎటుచూసినా మొండిగోడలు.. రాళ్లు.. రప్పలతో కనిపించింది. గురువారం పలువురు నిర్వాసితులు కూల్చిన ఇళ్లలో పనికి వచ్చే సామగ్రిని వెతికి తీసుకెళ్లారు. పుట్టి పెరిగిన ఊరిని.. ఉన్న ఇంటిని వదలడంతో కన్నీరు పెట్టుకున్నారు. రాత్రికిరాత్రే ఇళ్లను బలవంతంగా ఖాళీ చేయించడంతో కొంతమంది మహిళల రోదనను మిన్నంటాయి. ఇంత కాలం కలిసిమెలసి ఉన్నవాళ్లం అంతా విడిపోతున్నామని కన్నీరుమున్నీరయ్యారు. ఏదిఏమైనా బుధవారంతో గుడాటిపల్లి గ్రామం కనుమరుగైంది.



రోదిస్తున్న నిర్వాసితులు



**కదం తొక్కిన బీజేపీ శ్రేణులు**

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన నిరుద్యోగ మార్చ్ ఉత్సాహంగా కొనసాగింది. ఐబీ చౌరస్తా నుంచి పొట్టిరెడ్డిపల్లి చౌరస్తా వరకు పాదయాత్ర కొనసాగింది. – కొండాపూర్(సంగారెడ్డి)

## క్లుప్తంగా

### బైకు అదుపు తప్పి ఒకరు మృతి

మరొకరికి తీవ్రగాయాలు



సంగారెడ్డి మృతదేహం

**వట్‌పల్లి(అందోల్):** బైకు అదుపుతప్పి కల్వర్టు గుంతలోకి పడి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరొక వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని గొర్రెకల్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మనూరు మండలం రాయిపల్లి గ్రామానికి చెందిన దేవునూర్ సంగారెడ్డి(40), బంగ్లా ముజీబ్ అనే ఇద్దరు వ్యక్తులు తాడ్మనూర్ గ్రామంలో గురువారం పెళ్లికి వెళ్లి వట్‌పల్లి వైపు వస్తుండగా గొర్రెకల్ గ్రామ సమీపంలోకి రాగానే బైకు అదుపు తప్పి కల్వర్టు గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సంగారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ముజీబ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ముజీబ్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### శిఖం భూమి కబ్జాకు యత్నం

రైతుల ఆందోళన

**హుస్నాబాద్‌రూరల్:** హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో కాంసాని కుంట శిఖం భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారి కబ్జా చేస్తున్నారని రైతులు గురువారంనా ఆందోళన చేపట్టారు. మిషన్ కాకతీయ ఫేస్-3లో రూ.30లక్షలు పెట్టి కుంటకు మరమ్మతులు చేయడంతో వర్షపు నీరు చేరి ఆయకట్టు భూముల బావుల్లో ఊటనీరు సమృద్ధిగా చేరుతుందన్నారు. ఇప్పుడు కుంటను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి మొత్తం పూడ్చేస్తున్నారని ఆరోపించారు. కుంటలో నీళ్లు లేకపోతే గౌరవెల్లి ప్రాజెక్టు నీళ్లు ఏవైపుకు తరలిస్తారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బత్తిని సాయిలు, రైతులు రవీందర్‌రెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

### సైబర్ నేరస్తుని చేతుల్లోకి డబ్బులు వెళ్లకుండా ఫ్రీజ్

**కొండపాక(గజ్వేల్):** బాధితుని బ్యాంకు ఖాతానుంచి రూ.24,672లు సైబర్ నేరస్తుని చేతుల్లోకి వెళ్లకుండా ఫ్రీజ్ చేసినట్లు పోలీస్ కమిషనరెట్ కార్యాలయం తెలిపింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితుని ఫేస్‌బుక్‌లో ఇయర్ ఫోన్ ధర రూ.95 మాత్రమేనని పోస్టు కనిపించింది. దీంతో దాన్ని చూసిన బాధితుడు వెంటనే క్లిక్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన విధంగా ఎస్బీఐ క్రెడిట్ కార్డు నెంబరు, ఓటీపీ నెంబరు ఎంట్రీ చేశాడు. బాధితుని అకౌంట్లో ఉన్న రూ.24,672లు డెబిట్ అయ్యాయి. అనుమానం వచ్చిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. చేసేదేమి లేక మోసపోయినట్టుగా గుర్తించి వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ నెంబరు 1930కి గురువారం ఫిర్యాదు చేశాడు. దీంతో సైబర్ నేరస్తుని చేతుల్లోకి డబ్బులు వెళ్లకుండా ఫ్రీజ్ చేసినట్లు పోలీస్ కమిషనరెట్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

### విద్యుదాఘాతంతో గేదె మృతి



గేదె కళేబరం

**నారాయణఖేడ్:** వెంకటాపూర్ కిషన్‌నాయక్ తండాకు చెందిన రైతు బుజ్జిబాయికి చెందిన పాడిగేదె గురువారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గేదె మేత మేస్తూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. అక్కడ విద్యుదాఘాతానికి గురై మృత్యువాతకు గురైనట్లు బాధితురాలు తెలిపింది. గేదె విలువ రూ.70వేల వరకు ఉంటుందని బోరున విలపించింది. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



# రింగురోడ్డుపై నిర్లక్ష్యం ఎందుకు?

- రూ.230 కోట్లతో ప్రతిష్టాత్మకంగా పనులు
- నిలిచిపోయిన రైల్వే బ్రిడ్జి పనులు
- జాలిగామ-ధర్మారెడ్డిపల్లి మధ్య పెండింగ్



జాలిగామ-ధర్మారెడ్డిపల్లి గ్రామాల మధ్య అసంపూర్తి రైల్వే బ్రిడ్జి ఇదే

**గజ్వేల్:** గజ్వేల్ రింగు రోడ్డుపై నిర్లక్ష్యం అలుముకుంది. రూ.230 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పనులు 24కిలోమీటర్ల రింగు లక్ష్యానికి ఇప్పటికే 22.5కిలోమీటర్ల మేర పూర్తయ్యాయి. జాలిగామ-ధర్మారెడ్డిపల్లి గ్రామాల మధ్య దక్షిణ మధ్య రైల్వే శాఖ నిర్మించాల్సిన బ్రిడ్జి పనులు ఆగిపోయింది. 1.5 కిలో మీటర్ల మేర రింగు రోడ్డు అనుసంధానం పెండింగ్ పడింది. ఈ విషయంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ట్రాఫిక్ సమస్య నెలకొనడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. 2014 ఏప్రిల్ 9న గజ్వేల్ నియోజకవర్గం నుంచి నామినేషన్ వేయడానికి వచ్చిన సందర్భంలో 18న 'మెతుకుసీమ గర్జన' పేరిట నిర్వహించిన ఎన్నికల ప్రచార సభకు వచ్చిన సందర్భంలో ట్రాఫిక్ సమస్యను కేసీఆర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ క్రమంలోనే ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే గజ్వేల్‌లో నిర్వహించిన మొదటి సభలోనే పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో రూ.220కోట్ల నిధుల్లో సుమారుగా 50శాతం వరకు ఖర్చు చేసిన కాంట్రాక్టర్ ఆతర్వాత పనుల నుంచి తప్పుకున్నారు. 2108 డిసెంబర్ నుంచి 2021 డిసెంబర్ వరకు ఈ పనుల వ్యవహారం మూడేళ్లపాటు చడీచప్పుడు లేకుండా తయారైంది. దీంతో ఇక్కడ సమస్యను ఎత్తి చూపుతూ 'సాక్షి' వరుస కథనాలను ప్రచురించడమేకాకుండా జూమ్ డిబేట్లను నిర్వహించింది. ప్రభుత్వం ఈ పనులను రూ.118కోట్లతో రీ-టెండర్ చేయించి 2022 జనవరిలో పనులను పునఃప్రారంభించింది. రీ-టెండర్ తర్వాత కొన్ని కొత్త అంశాలను చేర్చారు. రింగు లక్ష్యం 24కిలోమీటర్లకు 22.5మేర రోడ్డు పూర్తిచేశారు. కానీ జాలిగామ-ధర్మారెడ్డిపల్లి గ్రామాల మధ్య గజ్వేల్ రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే బ్రిడ్జి పెండింగ్‌లో ఉండటం శాపంగా మారింది. ఈ బ్రిడ్జి కాకా, ఇక్కడ 1.5 కిలోమీటర్ల మేర రింగు రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక్కడ రైల్వే ట్రాక్ ఉండటంతో ఈ ట్రాక్‌పై నుంచి బ్రిడ్జి నిర్మించి దానిమీదుగా వాహనాలు వెళ్లేలా పనులు చేపట్టాల్సి ఉంది. కానీ పూర్తిచేయకుండానే అర్ధాంతరంగా వదిలేశారు. బ్రిడ్జి పూర్తయితే తప్పా ఈ రోడ్డు అనుసంధానమయ్యే అవకాశం లేదు. దక్షిణ మధ్య రైల్వే శాఖ నిర్లక్ష్యంవల్లే రింగు రోడ్డు అందుబాటులోకి రావడానికి బ్రేకులు పడుతున్నాయని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. మరోవైపు భూసేకరణ సమస్యలు కూడా మరో కారణంగా చెబుతున్నారు. ఈ సమస్యపై సమీక్ష నిర్వహించి పరిష్కరించాల్సిన అధికార యంత్రాంగం పట్టీ పట్టనట్లుగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై దక్షిణ మధ్య రైల్వే శాఖ డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా... భూసేకరణ సమస్యలతోపాటు వివిధ కారణాలతో పనులు ఇంత కాలం నిలిచిపోయాయని, త్వరలోనే పనులు పూర్తి చేయిస్తామన్నారు.

# అద్దె బస్సు డ్రైవర్ల ఆందోళన



నిరసన చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లు

**గజ్వేల్‌రూరల్:** ఆర్టీసీ అధికారులు తమపై దుర్భాశలాడారని అద్దె బస్సు డ్రైవర్లు ఆందోళన చేపట్టిన సంఘటన ప్రజ్ఞాపూర్‌లోగల జీపీపీ డిపో ఎదుట చోటు చేసుకుంది. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సురేఖ మాట్లాడుతూ ఇటీవల ఓ అద్దె బస్సు గజ్వేల్ నుంచి సంగారెడ్డికి ప్రయాణికులతో బయలుదేరింది. నర్సాపూర్ వద్ద ఆర్ఎం(రీజనల్ మేనేజర్) సుదర్శన్ చేపట్టిన తనిఖీల్లో సదరు బస్సు డ్రైవర్ మెడలో సెల్‌ఫోన్‌కు సంబంధించిన ఇయర్‌ఫోన్స్ లభించాయన్నారు. దీంతో వెంటనే సదరు డ్రైవర్‌కు కౌన్సిలింగ్ నిర్వహించిన తర్వాతే విధుల్లోకి తీసుకోవాలని సూచించారు. సదరు డ్రైవర్‌కు కౌన్సిలింగ్ అనంతరం ఆర్ఎం కార్యాలయానికి పంపించినట్లు తెలిపారు. మనస్థాపానికి గురైన సదరు అద్దె బస్సు డ్రైవరుతో పాటు 56మంది డ్రైవర్లు బస్సులను బయటకు తీయకుండా నిరసన చేపట్టారు.

### మందు బాబులకు జరిమానా

**సిద్దిపేట కమాన్:** వివిధ ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 22 మందికి న్యాయస్థానం రూ.50 వేల జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలో పలు ప్రాంతాల్లో ఐదు రోజుల క్రితం పోలీస్ అధికారులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 22మంది పై కేసులు నమోదు చేసి గురువారం కోర్టుకు హాజరు పర్చారు. వారికి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి రమేశ్ బాబు 22మందికి రూ. 50 వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

### మంజీర నదిలో దూకి..



అనసూయ మృతదేహం

**పుల్‌కల్(అందోల్):** వివాహేతర సంబంధం భర్తకు తెలిసిందనే కారణంతో మంజీర నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండల పరిధిలో పోచారంలో గురువారం జరిగింది. పుల్‌కల్ ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. బుధవారం సాయంత్రం భర్త బండారు లింగం పొలంలో వరికోతల అనంతరం ఇంటికి రాగా గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో తారసపడ్డాడన్నారు. ఆ వ్యక్తి ఎవరని భార్య అనసూయను నిలదీశాడు. దీంతో ఆమె సమాధానం చెప్పకుండా దాటవేసింది. భార్యపై అనుమానంతో ఆమె సెల్‌ఫోన్‌లో కొత్త నంబర్లను గమనించి గుర్తుతెలియని వ్యక్తిపై ఆరాతీశాడు. దీంతో అవమానానికి గురైనట్టు భావించిన అనసూయ ఇద్దరు పిల్లలతో పొలానికని వెళ్లి పిల్లలను మంజీర నది ఒడ్డున ఉంచి ఆమె నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న చుట్టు ప్రక్కల వారు నదిలోనుంచి తీసేలోపే మృతి చెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# లైంగికదాడి నిందితుడికి జీవితఖైదు

- రూ.50వేల జరిమానా
- ఎస్పీ రోహిణీప్రియదర్శిని



ఎస్పీ రోహిణి ప్రియదర్శిని


**మెదక్ మున్సిపాలిటీ:** చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన 65ఏళ్ల వ్యక్తికి జీవితఖైదుతోపాటు రూ.50వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు ఎస్పీ రోహిణీప్రియదర్శిని తెలిపారు. గురువారం మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. మనోహరబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన ఒక మహిళకు ఒక బాబు, పాప ఉన్నారని తెలిపారు. 2017, మే 28న ఆ మహిళ తన పిల్లలను ఇంట్లో వదిలి బియ్యం తీసుకురావడానికి వెళ్లింది. తిరిగి వచ్చేసరికి ఇంట్లో పాప కనిపించలేదు. దీంతో పక్కనే ఉన్న బంధువులను అడగగా 65ఏళ్ల వ్యక్తి పాపపై అఘాయిత్యానికి పాల్పడుతున్నాడని గ్రహించి అతన్ని పట్టుకునేలోపే పారిపోయాడన్నారు. అనంతరం ఆమహిళ తన పాపను స్థానిక ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారన్నారు. పాప తల్లి ఫిర్యాదు మేరకు మనోహరబాద్ పోలీసులు విచారణ అనంతరం కోర్టుకి నివేదిక అందజేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి లక్ష్మిశారద నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ. 50వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా కోర్టుకు సాక్ష్యాధారాలు సేకరించడంలో కృషి చేసిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# ముగ్గురి ఆత్మహత్య

**ఆస్తి తగాదాలతో ఓ వ్యక్తి, అప్పుల బాధ భరించలేక మరొకరు, మద్యానికి బానిసై ఇంకొకరు ఆత్మహత్య చేసుకున్నారు.**

**జహీరాబాద్ టౌన్:** ఆస్తి తగాదాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. చిరాగ్‌పల్లి ఎస్ఐ. కాశీనాథ్ తెలిపిని వివరాల ప్రకారం..మొగుడంపల్లి మండలంలోని ఖంజమల్‌పూర్ గ్రామానికి చెందిన అవుటి సదానంద్ అదే మండలంలోని గోపన్‌పల్లి గ్రామానికి ఇల్లరికం వచ్చాడు. ఖంజమల్‌పూర్‌లోని తల్లితండ్రుల ఆస్తిలో వాట ఇవ్వాలని అన్నదమ్ములను కోరాడు. ఈ విషయంలో అన్నదమ్ముల మధ్య గొడవలు తలెత్తడంతో మనస్థాపానికి గురై గురువారం గోపన్‌పల్లి ఫారెస్టు ప్రాంతంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య అవిటి సురేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**అప్పుల బాధ భరించలేక..**




తుకరాం రాథోడ్ మృతదేహం

**జహీరాబాద్ టౌన్:** అప్పుల బాధ భరించలేక తాగుడుకు బానిసై రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు చిరాగ్‌పల్లి ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మొగుడంపల్లి మండలంలోని నందునాక్ తండాకు చెందిన తుకారం రాథోడ్(40) తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటు జీవిస్తున్నాడు. ఈ క్రమంలో చేసిన అప్పులు తీర్చలేక తాగుడుకు బానిసయ్యాడు. ఇంట్లో ప్రతి రోజు గొడవపడేవాడు. గురువారం బాగా మద్యం సేవించి భార్యతో గొడవపడ్డాడు. అనంతరం తన పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు జహీరాబాద్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య జున్నుకా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**మద్యానికి బానిసై వ్యక్తి..**

**ఝరాసంగం(జహీరాబాద్):** మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని గంగాపూర్ గ్రామానికి చెందిన శివకుమార్(32) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టలో ఉంటూ ఆటో నడిపేవాడు. అక్కడ మద్యానికి అలవాటు పడ్డాడు. నెల రోజుల క్రితం గ్రామానికి వచ్చి ఆటో నడుపుతూ, రాత్రి వేళలో బాగా మద్యం సేవించేవాడు. వారం రోజుల క్రితం తన సెల్ ఫోన్ పోవడంతో బాగా తాగి ఇష్టం వచ్చినట్లుగా ప్రవర్తించేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్నాడు. గురువారం వేకువ జామున నాలుగు గంటల సమయంలో లేచి చూడడంతో ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ రెడ్డి తెలిపారు.



శివకుమార్ మృతదేహం

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



అశోక్ (ఫైల్)

**సిద్దిపేటరూరల్:** అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన తోర్నాల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం..తోర్నాల గ్రామానికి చెందిన శీలం అశోక్(48) తనకున్న ఎకరం పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆరు సంవత్సరాల క్రితం కూతురు వివాహానికి అప్పుచేసి పెళ్లిచేశాడు. అప్పు తీర్చడానికి దుబాయ్ వెళ్లి డబ్బు సంపాదించాలనుకున్నాడు. అక్కడ వెళ్లినంతరం కరోనా కారణంగా పనిదొరకకపోవడంతో మళ్లీ తిరిగి స్వగ్రామానికి చేరుకున్నాడు. ఇక్కడే ఉన్నదాంట్లో వ్యవసాయం చేసుకోవాలని వరి వేశాడు. తీరా చేతికొస్తుందనుకున్న సమయంలో అకాల వర్షంతో పంట దెబ్బతిన్నది. ఈ క్రమంలో పెరిగిన అప్పులు తీర్చే మార్గం లేక తనకు జీవితం మీద విరక్తి కలుగుతుందని, బతకాలని లేదని ఇంట్లో వాళ్లతో చెప్పేవాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన అశోక్ గురువారం ఉదయం పొలం కోయడానికి వెళ్తానని ఇంట్లో చెప్పి అక్కడే చెట్టుకు ఉరేసుకుని చనిపోయాడు. దీన్ని గమనించిన స్థానికులు అతని కొడుకు రంజిత్‌కు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు అక్కడ చేరుకునే లోపే అశోక్ చనిపోయాడు. మృతుని కొడుకు రంజిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# చెరువులో పడి ఇద్దరి మృతి

**చెరువులో పడి ఇద్దరు మృతి చెందారు. చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. మరో ఘటనలో వృద్ధుడు చెరువు కట్టమీదా నడుచుకుంటు వెళ్తుండగా చెరువులో పడి మృతి చెందాడు.**



సాయిబాబా మృతదేహం

**పెద్దశంకరంపేట(మెదక్):** మండల పరిధిలోని సంగారెడ్డిపేట చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం..సంగారెడ్డిపేటకు చెందిన లోక సాయిబాబా(33) గ్రామశివారులోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు తెలిపారు. భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

**చెరువులో పడి సబ్‌రిజిస్ట్రార్ తండ్రి**

**చేర్యాల(సిద్దిపేట):** ప్రమాదవశాత్తు చెరువులో పడి సబ్‌రిజిస్ట్రార్ తండ్రి మృతి చెందిన సంఘటన పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..స్థానిక ఎస్ఆర్వో కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న అంకం కృష్ణయ్యతో తండ్రి అంకం పుల్లయ్య(82)స్థానికంగా నివాసముంటున్నాడు. 2సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతున్న పుల్లయ్యకు గత సంవత్సరం బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. ఈ క్రమంలో వైద్యుల సూచన మేరకు ప్రతిరోజు వాకింగ్ చేస్తున్న పుల్లయ్య గురువారం ఉదయం ఇంటి సమీపంలో ఉన్న పెద్ద చెరువు కట్టపై వాకింగ్‌కు వెళ్లాడు. అక్కడ మళ్లీ స్ట్రోక్ రావడంతో చెరువులో పడిపోయాడు. దీన్ని గమనించిన చందు అనే యువకుడు నీటిలో దూకి బయటకు తీశాడు. ఈ విషయాన్ని స్థానికుల సహాయంతో కుటుంబ సభ్యులకు, 108 అంబులెన్స్‌కు సమాచారం చేరవేశాడు. వెంటనే అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులకు అప్పటికే మృతి చెందినట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. మృతుడి కుమారుడు కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



పుల్లయ్య మృతదేహం

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు..

**వాహనం ఢీ కొని వ్యక్తి**

**తూప్రాన్:** కూలీ పని కోసం వెళ్తున్న వ్యక్తిని వెనుకాల నుంచి టాటా ఏసీ వాహనం ఢీకొంది. వివరాలు ఇలా ఉన్నాయి..బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన నరేందర్‌రెడ్డి (45) కూలీ పని కోసం ఇంటి నుంచి వెళ్లున్నక్రమంలో వెనుకాల నుంచి టాటా ఏసీ వాహనం అతివేగంగా వచ్చి ఢీకొంది. దీన్ని గమనించిన గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుని భార్య మీనా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**లారీ ఢీకొని మహిళ**

**పటాన్‌చెరు టౌన్:** లారీ ఢీకొని ఓ మహిళ దుర్మరణం చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల, పోలీసుల కథనం ప్రకారం..పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామం మల్లికార్జున్ నగర్ కాలనీకి చెందిన దుర్గమ్మ(55) గురువారం బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి గ్రామానికి వచ్చి రాత్రి రోడ్డు దాటుతుండగా పటాన్‌చెరు వైపు నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో దుర్గమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. సమచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



దుర్గమ్మ (ఫైల్)

# చికిత్స పొందుతున్న ముగ్గురు..



సురేష్ మృతదేహం

**కొల్చారం(నర్సాపూర్):** పురుగుల మందు సేవించి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో వెలుగు చూసింది. గ్రామానికి చెందిన బట్టు యాదమ్మ సామెల్ దంపతుల కుమారుడు బట్టు సురేష్ (21) పని పాట లేకుండా ఇంటివద్దే ఉంటున్నాడు. తల్లిదండ్రులు పనిచేయాలని మందలించడంతో సురేష్ 6వ తేదీన రాత్రి 11 గంటల ప్రాంతంలో పురుగుల మందు సేవించానని తల్లిదండ్రులకు చెప్పాడు. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం మెదక్ ఏరియఆసుపతకి తరలించారు. అక్కడ వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సురేష్ మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

**జోగిపేట(అందోల్):** అందోల్ మండల పరిధిలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 9న అన్నాసాగర్ దర్గా వద్ద టాటా ఏసీ ఆటో, స్కూటీ ఢీకొన్న సంఘటనలో స్కూటీపై ప్రయాణిస్తున్న రాజు (20) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు జోగిపేట ఎస్ఐ సామ్య నాయక్ తెలిపారు.

**మరొక సంఘటనలో..**

ఈ నెల 9న చింతకుంట శివారులో ఎదురెదురుగా వస్తున్న బైకులు ఢీకొన్న సంఘటనలో పట్టణానికి చెందిన ప్రభు(35) మృతి చెందాడు. ఎస్ఐ సామ్య నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..బైకులు ఢీకొన్న ఘటనలో గాయాల పాలైన ప్రభును జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారన్నారు. ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ప్రభు (ఫైల్)

# వేర్వేరు ఘటనల్లో ముగ్గురు అదృశ్యం

**వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. కుటుంబ సభ్యులు ఆయా పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు.**



సుజాత (ఫైల్)

**పటాన్‌చెరు టౌన్:** కూతురు అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు చేసిన సంఘటన భానూర్-బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..కామారెడ్డి జిల్లా గాంధారి మండలం సోమ్లానాయక్ తండాకు చెందిన బానోత్ నాను కుటుంబ సభ్యులతో కలిసి రెండు నెలల క్రితం బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం పాశమైలారం వచ్చి, ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజుమాదిరిగా నాను, అతడి భార్య 10వ తేదీన డ్యూటీకి వెళ్లారు. ఇంట్లో కూతురు సుజాత(20) ఉంటుంది. డ్యూటీ ముగించుకొని తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి కూతురు కనిపించలేదు. ఆమె బట్టలు కూడా లేవని కుటుంబ సభ్యులు తెలిపారు. కూతురి కోసం తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి నాను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**గృహిణి ...**



లక్ష్మి (ఫైల్)

**వర్గల్(గజ్వేల్):** మానసికంగా అనారోగ్యంతో బాధపడుతున్న గృహిణి మూడురోజుల క్రితం అదృశ్యమైంది. ఈ ఘటన వర్గల్ మండలం అంబర్‌పేటలో జరిగింది. గౌరారం ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..అంబర్‌పేటకు చెందిన ధర్మని రమేశ్ భార్య లక్ష్మి గత ఐదేళ్ల నుంచి మానసిక అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ క్రమంలో ఆసుపత్రిలో చికిత్స చేయించిన కూడా ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగవ్వలేదు. సోమవారం రాత్రి ఇరువురు భోజనం చేసి నిద్రపోయారు. మంగళవారం నిద్రలేచి చూసేసరికి లక్ష్మి కన్పించలేదు. ఆందోళనకు గురైన అతను చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో అతను గౌరారంలో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

**యువకుడి...**



దేవయ్య (ఫైల్)

**చిన్నకోడూరు(సిద్దిపేట):** మతి స్థిమితం లేని యువకుడు అదృశ్యమైన ఘటన రామంచ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. రామంచ గ్రామానికి చెందిన కావటి దేవయ్య(25) చిన్నప్పటి నుంచి మతి స్థిమితం లేదు. ఇంటి వద్దే ఉంటూ ఇంటి పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో ఈ నెల 8న అర్ధరాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబీకులు గ్రామంలో, బంధువుల ఇంటి వద్ద ఆరా తీశారు. అయినప్పటికీ అతని ఆచూకీ లభ్యం కాలేదు. సోదరుడు కావటి భిక్షపతి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.